క్లుప్తంగా

పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిది



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అన్నా కృష్ణచైతన్య

మార్కాపురం: అమరజీవి పొట్టిశ్రీరాములు మహనీయుడని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం కిట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రులు అన్యాయానికి గురవుతుంటే ప్రత్యేక రాష్ట్రమే సమస్యకు పరిష్కారమని భావించి ఆమరణ దీక్ష చేసి రాష్ట్రంకోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్టారెడ్డి, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు రామ్మోహన్, అనీల్‌కుమార్, రాముడు, కిశోర్‌బాబు, ప్రసన్న మురళీ, రమణారెడ్డి, అమృతవల్లి, మనోహర్, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు రంగస్వామి, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బేస్తవారిపేట: ఒంగోలులో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను శుక్రవారం బేస్తవారిపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లగాలి విజయ్ మాట్లాడుతూ.. నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకుడు విల్సన్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్, చిట్టిబాబు, విజయ్, ప్రసన్న, రత్నాకర్ పాల్గొన్నారు.

పంచారామాల యాత్రకు ప్రత్యేక బస్సులు

పొదిలి: కార్తీక మాసం సందర్భంగా భక్తులు పంచారామాలు దర్శించుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం సుందరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరారామం, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారరామం ఆలయాలను భక్తులు దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. 4, 11, 18, 25వ తేదీల్లో పవిత్ర సోమవారం రోజున భక్తులు పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని చెప్పారు. ఒకరికి ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ.1700, సూపర్ లగ్జరీ చార్జీ రూ.2200 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆదివారం రాత్రి 10 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు పొదిలికి బస్సులు చేరుకుంటాయని తెలిపారు. వివరాలకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

5న మున్సిపల్ దుకాణాల వేలం

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి వివిధ సెంటర్లలో 10 షాపులు, 2 బంకులకు ఈ నెల 5న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ నారాయణరావు శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలోని కొత్త మార్కెట్ పడమర వైపు, దక్షిణం వైపు, ఈ సేవా సెంటర్, పాత బస్టాండ్ పడమర వైపు, అయ్యప్ప స్వామి గుడి ఎదురు వైపు, పాత మార్కెట్ సెంటర్ తూర్పువైపు, గాంధీ పార్కు సెంటర్ దక్షిణం వైపు గల మొత్తం 10 షాపులు, రెండు బంకులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. హక్కుదారులు మూడేళ్లపాటు దుకాణబూలాలు నిర్వహించుకోచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం కార్యాలయం పనివేళల్లో రెవెన్యూ విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజబాబు తదితరులు

మార్కాపురం: డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు వివరించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లతో సమైక్యతా ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. దేశాన్ని సమైక్యంగా ఉంచాలని పటేల్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ డాక్టర్ మస్తానయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడి భవనం.. అసంపూర్ణం!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కారు బడుల్లో విద్యా సంస్కరణల అమలులో భాగంగా నాడు నేడు పథకం ద్వారా మండలంలోని 47 పాఠశాలలను ఎంపిక చేసి నూతన భవన నిర్మాణాలకుగాను రెండు విడతలుగా కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాల నిర్మాణాలకు సంబంధించి నిధులు నిలిపివేసింది. దీంతో భవన నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా భవన నిర్మాణాలు ఉండటంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- నాడు–నేడు పనులకు నిధులు నిలిపేసిన కూటమి ప్రభుత్వం
- తర్లుపాడు మండలంలో మధ్యలోనే ఆగిన భవన నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు



శ్లాబ్ వరకు పూర్తయిన తుమ్మలచెరువు జెడ్పీహెచ్ఎస్ అదనపు తరగతి గదులు

తర్లుపాడు:

మండలంలో మొత్తం 51 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 5 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు నేడు మొదటి విడతలో భాగంగా 21 పాఠశాలలను ఎంపికచేసి 4.92 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి నిర్మాణాలు పూర్తి చేసింది. 2వ విడతలో భాగంగా 24 పాఠశాలలకుగానూ 11.37 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది. ఇందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. మరికొన్ని భవనాలు శ్లాబ్ దశలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో అసంపూర్తిగా మిగిలాయి. దీంతో అదనపు గదులు పూర్తికాక, తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువు కొనసాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై దృష్టిపెట్టి నూతన భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్లాబ్ వరకు నిర్మాణాలు పూర్తి

మండలకేంద్రం తర్లుపాడులోని ఎంపీపీ ఏఏ పాఠశాల, తుమ్మలచెరువు జెడ్పీహెచ్ఎస్, మీర్జపేట జెడ్పీహెచ్ఎస్, కలుజువ్వలపాడులోని ఎస్సీకాలనీ ఎంపీపీ స్కూల్, కేతగుడిపి ఎస్సీ కాలనీలోని స్కూల్ భవనాలు శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. అదనపు వసతులు కల్పించి విద్యార్థులకు పాఠశాల భవనాలు అందుబాటులోకి తీసుకు రావాల్సిన నూతన ప్రభుత్వం ఆ దిశగా దృష్టి పెట్టకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బిల్డింగ్ నిర్మాణం పూర్తయిన తర్లుపాడు ఏఏ ఎంపీపీ పాఠశాల



మార్కాపురంలో అసంపూర్తిగా ఉన్న జెడ్పీ పాఠశాల

త్వరలో పూర్తి చేస్తాం

మండలంలోని పాఠశాలల నూతన భవన నిర్మాణాల పురోగతి గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతం చేస్తాం.

– సుబ్బారావు, ఎంఈఓ 2

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగని వేధింపులు



గురుగుపాడులో కూలీలను విచారిస్తున్న ఎంపీడీఓ

పొదిలి రూరల్: పొదిలి మండలంలో అధికార పార్టీ నాయకులు ఎలాగైనా తమ పంతం నెగ్గించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజీనామా చేస్తారా లేక తొలగించమంటారా అని చిరుద్యోగులను బెదిరిస్తూ వస్తున్నారు. కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు, వీఓఏలు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు.. ఇలా అన్ని రకాల ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ రాజీనామా చేయిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై ఈ తరహా వేధింపులు తీవ్రంగా కొనసాగుతున్నాయి. తొలుత మర్యాదగా చెప్పడం, రాజీనామా చేయని వారిపై కూటమి కార్యకర్తలతో అధికారులకు ఫిర్యాదు చేయించడం పరిపాటిగా మారింది. దీంతో చేసేది ఏమీలేక అధికారులు కూడా విచారణ చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాయకుల ఒత్తిడి తట్టుకోలేక మండలంలో ఇప్పటి వరకు అన్నవరం, తలమళ్ల, ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లి గ్రామాల్లో ఎఫ్ఏలు రాజీనామా చేశారు. మిగిలిన వారిపైనా ఒత్తిడి ఎక్కువగా ఉంది. రెండు వారాల వ్యవధిలో మూగచింతల, జువ్వలేరు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం తుమ్మగుంట ఎఫ్ఏపై అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ జి.శోభన్‌బాబు విచారణ చేశారు. అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో దాదాపు 30 మందితో సంతకాలు చేయించగా విచారణ సమయంలో మాత్రం వారిలో ఇద్దరు మాత్రమే హాజరై ఏమీ చెప్పలేదు. దీంతో ఎంపీడీఓ ఇరువర్గాల వాదనలు నమోదు చేసుకుని వెనుదిరిగారు. ఆయన వెంట ఏపీఓ టి.వెంకట్రావు ఉన్నారు.

మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వార్డు మహిళలు, ప్రజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కొండేపల్లిరోడ్డులో మున్సిపల్ స్థలంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించాలని కోరుతూ 21, 22 వార్డులోని ప్రజలు, మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. మున్సిపల్ స్థలాన్ని ఏ ఒక్క వర్గానికి ఇవ్వకుండా వార్డులోని ప్రజలకు ఉపయోగపడే అంగన్‌వాడీ, గ్రంథాలయం, స్కూల్‌తోపాటు ఇతర ఉపయోగకర భవనాలు నిర్మించాలని కోరారు. అనంతరం కమిషనర్ నారాయణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఎవరికీ కేటాయించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా అయితే ప్రభుత్వానికి అవసరమైన స్థలాలను ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కౌన్సిల్‌లో ఆమోదించినా ఎవరికీ స్థలం ఇచ్చేది లేదన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బీజేపీ నాయకులు కృష్ణారావు, వార్డులోని మహిళలు మర్రి కొండలు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



బహుమతులు అందిస్తున్న మేనేజర్ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలన మన పాత్రపై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న జ్యోత్స్న, జెస్సీ, ఈశ్వర్, దివ్య, అంజుమ్ గెలుపొందారు. వీరికి తిప్పాయపాలెం ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముందుగా విద్యార్థులతో పలు అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సిరిల్‌కుమార్, అనుప్రియ

కొమరోలు: స్థానిక సర్వైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇరువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ ఎస్తేరుమేరి తెలిపారు. అండర్–17 బాలబాలికల విభాగంలో సోంపల్లి సిరిల్‌కుమార్ హ్యామర్ త్రోలో ప్రథమ స్థానం, ఇసుకల అనుప్రియ హైజంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు వివరించారు. వీరు ఈనెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ వెంకటసత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

పశుగణన ప్రారంభం

కొనకనమిట్ల: 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని గొట్లగట్టు పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి శుక్రవారం గొట్లగట్టు గ్రామంలో ప్రారంభించారు. పశు పోషకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలపాటు సాగనున్న సర్వేలో పశు పోషకులు తమ పశువులు, ఇంకా జీవాలు, కోళ్ల తదితర వివరాలు తెలియజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు.


పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంభం: మండలంలోని ఎల్‌కోట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ వీరభద్రాచారి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, సౌకర్యాలు, తరగతి గదులు పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయిని జి.అభిగైల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు



వివరాలు సేకరిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడికి వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద ఓ ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమై ఉండటాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బి.నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మల్లేష్ అనే యువకుడు అతని స్నేహితుడు కృష్ణకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని తిరుగుతున్నాడని, ఈ క్రమంలో మద్యం మత్తులో అతనే కాల్చి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన 'కామూరి'



వైఎస్ జగన్‌తో కామూరి రమణరెడ్డి

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణారెడ్డి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందులలోని నివాసంలో వైఎస్ జగన్‌ను కలిసి స్థానికంగా పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు.

గొడవలొద్దు.. బుద్ధిగా చదువుకోండి

- వివాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు
- విద్యార్థులకు డీఎస్పీ నాగరాజు హెచ్చరిక



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: విద్యార్థులు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల, ఇందిర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఒకసారి కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు రావని, విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వెళ్లలేరని హితబోధ చేశారు. విద్యార్థులు చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. లక్ష్యసాధన వైపు అడుగువేయాలే తప్ప ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వైపు దృష్టిపెడితే జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు గొడవల్లో పాలుపంచుకున్నట్లు తెలిస్తే క్షమించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఇందిర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, జార్జి కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు, రూరల్ ఎస్సై అంకమరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి: పొగాకు ధరలు శాశ్వతం కాదని, అంతర్జాతీయంగా చోటుచేసుకునే పరిణామాలు ధరలను ప్రభావితం చేస్తాయని పొగాకు బోర్డు అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు, సాగు నియంత్రణపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుని, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ, లాభదాయకమైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ మాట్లాడుతూ పొగాకు విస్తీర్ణాన్ని ఈ పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు రైతులకు ప్రభుత్వ పరంగా సాయం అందుతుందన్నారు. ఉద్యానశాఖ అధికారిణి సంధ్య మాట్లాడుతూ రైతులకు అందజేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల గురించి వివరించారు. బోర్డు ప్రాంతీయ కార్యాలయం సూపరిండెంట్ జె.తులసి మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తిలో మూడో స్థానం, ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్నామన్నారు. కేటాయించిన విస్తీర్ణంలోనే పొగాకు సాగు చేసి అధిక దిగుబడి పొందేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సమావేశంలో కనిగిరి వేలం కేంద్రం సూపరిండెంట్ బి.కోటేశ్వరరావు, పొదిలి, కనిగిరి వేలం కేంద్రాల పరిధిలోని బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు



మార్కాపురంలో చెన్నకేశవ స్వామి నగరోత్సవం

బేస్తవారిపేట/మార్కాపురం: చిచ్చుబుడ్డి వెలుగులు.. తారాజువ్వల తళుకులు.. కాకరవత్తుల కాంతులు.. అదిరిపడే బాంబుల మోత మధ్య గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల ప్రజలు గురువారం దీపావళి సంబరాలు నిర్వహించుకున్నారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. సాయంత్రం వేళ ప్రమిదల్లో దీపాలు వెలిగించి తమ జీవితాల్లో చీకటి తొలగిపోయి కొత్త వెలుగులు రావాలని కాంక్షిస్తూ పూజలు చేశారు.

మార్కాపురం పట్టణంలో నరకాసుర వధ ఘట్టం అట్టహాసంగా సాగింది. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నరకచతుర్ధిని పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. నరకాసుర వధ అనంతరం స్వామివారిని మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయం ఎదుట, మెయిన్‌బజార్‌తో పాటు పలు ప్రాంతాల్లో నరకాసుడిని కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. శుక్రవారం పలు ఆలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎస్వీకేపీ కళాశాలలో క్రాకర్స్ షాపులు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంగణమంతా జనంతో కిటకిటలాడింది.

రెండు ఆటోలు ఢీ

- ముగ్గురికి గాయాలు



సంఘటనా స్థలంలో ఆటోలు

పొదిలి: ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న సంఘటన మార్కాపురం రోడ్డులో ఆక్స్‌ఫర్డ్ స్కూలు సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. సిరిగిరిపాడు మండలం సేవా నాయక్ తండాకు చెందిన రామావత్ కృష్ణా నాయక్ ఒంగోలులో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీపావళి పండుగకు భార్య పిల్లలతో కలిసి ఆటోలో స్వగ్రామం వెళ్లి ఒంగోలుకు తిరుగు ప్రయాణంలో ఉన్నాడు. అదే సమయంలో పొదిలికి చెందిన మణికంఠారెడ్డికి చెందిన వాటర్ బబుల్స్ ఆటో సలకనూతల వైపు వెళ్తోంది. రెండు ఆటోలు ఆక్స్‌ఫర్డ్ స్కూలు సమీపంలో ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్ కృష్ణానాయక్‌కు తీవ్ర గాయాలు కాగా ఆయన కుమారునికి తలకు గాయమైంది. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని పొదిలి వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.